నేటి నుంచి పాతగుట్టలో అధ్యయనోత్సవాలు

పాతగుట్ట ఆలయం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ పూర్వగిరి (పాత గుట్ట) వార్షిక అధ్యయనోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం తిరుమంజనం, సాయంత్రం తొళక్కంతో కార్యక్రమాలకు ప్రధానార్చకులు శ్రీకారం చుట్టనున్నారు. మంగళవారం ఉదయం పురప్పాట్ సేవ, తిరుమంజనం, దివ్య ప్రబంధ సేవాకాలం, సాయంత్రం పురప్పాట్ సేవ, దివ్య ప్రబంధ సేవాకాలం నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం పురప్పాట్ సేవ, తిరుమంజనం, విద్య ప్రబంధ సేవాకాలం, సాయంత్రం పురప్పాట్ సేవ, దివ్య ప్రబంధ సేవాకాలం, నమ్మళ్వార్ పరమపదోత్సవం చేపట్టనున్నారు. గురువారం ఉదయం పురప్పాట్ సేవ, శ్రీరామానుజాచార్య తిరుమంజనం, నూత్తందారి చాత్మరాతో అధ్యయనోత్సవాలకు ముగింపు పలుకనున్నారు.

7నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

పూర్వగిరి (పాతగుట్ట) లక్ష్మీనరసింహ స్వామి 2025 వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈ నెల 7న ఉదయం స్వస్తీవాచనం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనంతో ఆలయ ప్రధానార్చకులు శ్రీకారం చుట్టనున్నారు. 8న సాయంత్రం 6గంటలకు భేరీ పూజ, దేవతాహ్వానం, 9న ఉదయం సింహ వాహన అలంకార సేవ, రాత్రి అశ్వవాహన అలంకార సేవతోపాటు ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించనున్నారు. 10న ఉదయం హనుమంత వాహన అలంకార సేవ, రాత్రి గజహవాన అలంకార సేవ, స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 11న ఉదయం గరుడ వాహన అలంకార సేవ, రాత్రి స్వామివారి దివ్య విమాన రథోత్సవం నిర్వహించనున్నారు. 12న మధ్యాహ్నం చక్రతీర్థం, సాయంత్రం దేవతోద్వాసన, పుష్పయాగం, డోలోత్సవం చేపడుతారు. 13న ఉదయం 10గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం, మహదాశీర్వచనం, పండిత సన్మానంతో వార్షిక బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలుకనున్నారు.

కేటీఆర్‌ను కలిసిన వంశీకృష్ణ

కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న వంశీకృష్ణ

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 2 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మండలంలోని టి.రేపాక గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకుడు ఏనూతల వంశీకృష్ణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

మైనార్టీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, మైనార్టీ ఉద్యోగులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 2 : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఆవిష్కరించారు.

కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి జగన్మోహన్‌ప్రసాద్, మైనార్టీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ లాయక్‌అలీ, ప్రధాన కార్యదర్శి అజయ్ హుస్సేన్, రాష్ట్ర కో ఆర్డినేటర్ జమాల్ షరీఫ్, ఫరాతుల్లా బియబాని, ముజఫర్, అలీబాబా, మిస్బా వుద్దీన్, మహమ్మద్ అఫ్రోచ్, ఖయ్యూం, జాఫర్, సలీం, సలీంపాషా, అక్బర్, రఫీ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో వామపక్షాలు కలిసి పనిచేస్తాయి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జహంగీర్‌ను సన్మానిస్తున్న శ్రీరాములు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 2 : స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా వామపక్షాలు కలిసి పనిచేస్తాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో ఆదివారం సీపీఎం, సీపీఐ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం వామపక్షాలు ఒకే తాటిమీదికి వచ్చాయన్నారు. రానున్న గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో సమన్వయంతో పనిచేసి ఎక్కువ స్థానాలు గెలువడం కోసం కృషి చేస్తామని చెప్పారు. జిల్లాలో చిన్న నీటి ప్రాజెక్టులు, మూసీ ప్రక్షాళన, గోదావరి జలాల సాధన, ఇతర సమస్యల పరిష్కారం కోసం కలిసి పనిచేస్తామని చెప్పారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా ఎన్నికైన ఎండీ జహంగీర్‌ను సన్మానించారు. సమావేశంలో నాయకులు ఏశాల అశోక్, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, వెంకటేశ్, అంజయ్య, పాల్గొన్నారు.

సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తాం

- జలసాధన సమితి కన్వీనర్ కట్టా భగవంతరెడ్డి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ భగవంతరెడ్డి

చౌటుప్పల్, ఫిబ్రవరి 2 : సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ ప్రొఫెసర్ కట్టా భగవంతరెడ్డి అన్నారు. మండలంలోని దండు మల్కాపురం ఆందోళ్‌మైసమ్మ దేవాలయంలో ఆదివారం పూజలు చేసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరపత్రాల ద్వారా రైతులను చైతన్య పరుస్తామన్నారు. వానలు లేక తీవ్ర ఎద్దడిలో ఉన్న గ్రామాలకు సాగునీరు అందించేందుకు తమ సంస్థ పనిచేస్తుందని తెలిపారు.

కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మెట్టు సుదర్శన్, బూడిద జగన్మోహన్‌రెడ్డి, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, కంచరకుంట్ల వెంకట్‌రెడ్డి, వెల్మ కృష్ణారెడ్డి, రుద్రాల యాదగిరి, పన్నాల ప్రతాప్‌రెడ్డి, కొంతం అనంతరెడ్డి, ఫక్కీరు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

కూరెళ్లలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కృష్ణయ్య

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 2 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కృష్ణయ్య అన్నారు. మండలంలోని కూరెళ్ల గ్రామంలో ఆదివారం గ్రామ ప్రజలకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని యువకులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా మంచి లక్షణాలను కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమేశ్, ఉప్పలయ్య, మత్స్యగిరి, లింగం పాల్గొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలమైన కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించండి : సీపీఎం

- పలు చోట్ల బడ్జెట్ ప్రతుల దహనం

చౌటుప్పల్‌లో బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

బీబీనగర్, ఫిబ్రవరి 2 : పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నదని, బడ్జెట్‌ను సర్వత్రా వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు, ధనవంతులకు అనుకూలంగా, సామాన్య ప్రజలపై భారాలు వేసేదిగా ఉన్నదన్నారు. వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీ పథకానికి, విద్య, వైద్య రంగాలకు, సూక్ష్మ పరిశ్రమలకు కేటాయింపులు తగ్గించారని తెలిపారు. అనేక సంక్షేమ పథకాలకు సబ్సిడీలు తగ్గించారని, రానున్న రోజుల్లో సామాన్య ప్రజలపై మరిన్ని భారాలు పడనున్నాయని అన్నారు. బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం పునఃసమీక్షించి ప్రాధాన్యత రంగాలకు నిధుల కేటాయింపులు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు కందాడి దేవేందర్ రెడ్డి ఒవల్దాస్ సతీశ్, నోముల ఎల్లారెడ్డి, ఒవల్దాస్ మణికుమార్, పొన్నాల నవీన్, చెంచల సురేందర్, జంగయ్య, స్వామి, భగత్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

చౌటుప్పల్ : పట్టణంలోని బస్టాండ్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ అంకెల గారడీ తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. నిరుపేదలకు కాకుండా కార్పొరేట్ శక్తులకు, బడా పెట్టుబడిదారులకు రాయితీలు ఇచ్చిందని విమర్శించారు. నిత్యావసరాల ధరల నియంత్రణ ఊసే లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్, నాయకులు బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, ఖయ్యూం, స్వామి, ఎర్ర ఊషయ్య, మల్లేశం పాల్గొన్నారు.

వలిగొండ : కేంద్ర బడ్జెట్ పేదరికాన్ని నిర్మూలించడానికి బదులుగా పేదలను నిర్మూలించే విధంగా ఉన్నదని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భువనగిరి – చిట్యాల రహదారిపై బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగ స్వామి మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఆదానీ, అంబానీలు తయారు చేసినట్లుగా, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, కష్టజీవులకు వ్యతిరేకంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మెరుగు వెంకటేశం, మామిడి వెంకట్ రెడ్డి, నర్సింహ, మణెమ్మ, సత్తయ్య, లక్ష్మయ్య, యాదగిరి, వెంకటేశం పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు కోట రామచంద్రారెడ్డి, దుబ్బాక జగన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల కనుసైగల్లో బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. విద్య, వైద్యంతోపాటు ఉపాధి హామీ, గ్రామీణ అభివృద్ధికి సరైన నిధులు కేటాయించినప్పుడే దేశం అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధు, లక్ష్మయ్య, యాదగిరి, కృష్ణ, అలీ పాల్గొన్నారు.

రామన్నపేట : మండల కేంద్రంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను సీపీఎం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదలకు, రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చేలా లేదన్నారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నా ఫలితం శూన్యమని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు బావండ్లపల్లి బాలరాజు, గొరిగే సోములు, బల్గూరి అంజయ్య, కందుల హన్మంతు, లెనిన్, సత్యం, రమేశ్, వెంకటేశం పాల్గొన్నారు.

రామన్నపేటలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

వలిగొండలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

భూదాన్ పోచంపల్లిలో..

బీబీనగర్ : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారికే ఇందిరమ్మ ఇండ్లు

- నాకు తెలియకుండా పార్టీ నాయకులు ప్రెస్‌మీట్ పెడితే సస్పెండ్ చేస్తా
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లింగయ్యయాదవ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లింగయ్యయాదవ్

అడ్డగూడూరు, ఫిబ్రవరి 2 : గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారికే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు నిర్వహిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుల సన్మాన సభకు ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ఎటువంటి సంబంధం లేదని, ఆ సభకు కార్యకర్తలు వెళ్లవద్దని అన్నారు. ఆ సభకు వెళ్లిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులమని చెప్పుకొంటున్న వారు దొంగలని, వారిని నమ్మకూడదని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, పైళ్ల సోమిరెడ్డికి సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించబడిన 8 నెలల తర్వాత సన్మాన సభ ఎందుకని ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీతో కుమ్మక్కై ఆ పార్టీ అభ్యర్థి దగ్గర డబ్బులు తీసుకొని వారి గెలుపు కోసం పని చేశారని ఆరోపించారు. ఈ సీనియర్ నాయకులే గతంలో కోమటిరెడ్డి బ్రదర్స్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మధ్య గొడవలు పెట్టారని అన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచందర్‌రావు, లక్ష్మీదేవికాల్వ మాజీ సర్పంచ్ నారగోని అంజయ్యకు ఇసుక దందా, డబ్బు సంపాదనలే ప్రధాన ఎజెండా అని విమర్శించారు. ఇక వారి ఆటలు సాగవని హెచ్చరించారు. ఎమ్మెల్యే సామేల్‌ను దూషించిన వారిని వదలమన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా తనకు తెలియకుండా పార్టీ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి ఎమ్మెల్యేను దూషిస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. పార్టీ తనకు పుల్ పవర్ ఇచ్చిందన్నారు. మోత్కూరులో మినీ స్టేడియం కోసం 2016లో ఫాదర్ ప్రభుత్వానికి స్థలం ఇస్తే కొందరు కబ్జా చేయాలని చూశారని, అడ్డుకున్న ఎమ్మెల్యే సామేల్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాలెంల విద్యాసాగర్, సోమన్న, టీపీసీసీ రాష్ట్ర నాయకుడు ఇటికాల చిరంజీవి, నాయకులు రాంరెడ్డి, సైదులు, శ్రీశైలం, వెంకన్న, గంగయ్య, వినోద పాల్గొన్నారు.

రాష్ట్రానికి నిధుల కేటాయింపులో కేంద్రం వివక్ష

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 2 : కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో వివక్ష చూపుతున్నదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మ్యాచింగ్ గ్రాంట్స్ 40శాతం తెలంగాణకు పెడితే, 60 శాతం కేంద్రం ఇవ్వాల్సిన వాటాలో మనకు ఎంతిచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలకు కేంద్రం నుంచి ఎలాంటి గ్రాంట్స్ మంజూరు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో అనేక సార్లు నిధుల మంజూరు కోసం ప్రయత్నం చేశారని తెలిపారు. అయినా బడ్జెట్‌లో తెలంగాణకు చోటు కల్పించలేదని, విభజన హామీలు కూడా అమలు చేయలేదని విమర్శించారు. చిన్న రాష్ట్రమైన తెలంగాణ నుంచి 5 శాతం జీడీపీ వస్తున్నా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాలేదన్నారు. కేంద్రానికి ఢిల్లీ, బీహార్ ఎన్నికలు కన్పిస్తున్నాయి తప్ప.. మిగతా రాష్ట్రాలు కన్పించడం లేదని విమర్శించారు. తెలంగాణకు అన్యాయం జరిగిందని సమాజం కోడై కూస్తున్నా బీజేపీ ఎంపీలకు అర్థం కావట్లేదన్నారు. ప్రధాని మోదీ తెలంగాణకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. బ్రహ్మాండమైన బడ్జెట్ అంటున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయం గుర్తిస్తలేరా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంపై నిర్మలా సీతారామన్ నిమిషం కూడా మాట్లాడలేదన్నారు. టికెట్ల నియంత్రణ చేయలేనప్పుడు కోట్ల రూపాయలు పెట్టి విమానాశ్రయాలు నిర్మించడం దేనికని ప్రశ్నించారు. ఇకనైనా బీజేపీ ఎంపీలు తెలంగాణకు రావాల్సిన నిధుల గురించి ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు బర్రె జహంగీర్, పడిగెల ప్రదీప్, కొల్లూరి రాజు పాల్గొన్నారు.

ఈ నెల 4న గుట్టలో రథసప్తమి వేడుకలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో ఈ నెల 4న ఉదయం 8గంటలకు రథసప్తమి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై వేంచేపు చేసి తిరుమాఢవీధుల్లో ఊరేగించనున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు. తూర్పు రాజగోపురం వద్ద చతుర్వేద పారాయణం, రథసప్తమి విశిష్టతను భక్తులకు విశదీకరించనున్నట్లు తెలిపారు. రాత్రి 7గంటలకు స్వామివారిని బంగారు రథంపై ఆలయ అంతఃప్రాకారంలో ఊరేగిస్తామన్నారు. రథసప్తమి సందర్భంగా 4న ఉదయం 7నుంచి 10 గంటల వరకు స్వామివారి ఆలయంలో భక్తులతో నిర్వహించే సువర్ణ పుష్పార్చన రద్దు చేయనున్నట్లు వెల్లడించారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని పీసీసీ అధ్యక్షుడికి వినతి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 2 : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మాదిగ నాయకులు వినతి పత్రం అందజేశారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన రోజు శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు బర్రె జహంగీర్, కొల్లూరి రాజు, పడిగెల ప్రదీప్, ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగకరం

మోటకొండూర్, ఫిబ్రవరి 2 : పేదల ఆరోగ్యానికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని మోటకొండూర్ మాజీ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత అన్నారు. మండల కేంద్రంలో నీలిమా హాస్పిటల్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నీలిమా హాస్పిటల్స్‌లో భవిష్యత్‌లో వైద్యం చేయించుకునే వారికి 50శాతం రాయితీతో కూడిన డిస్కౌంట్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో నీలిమా హాస్పిటల్స్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి ఊసే లేని కేంద్ర బడ్జెట్ : డీవైఎఫ్ఐ

బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 2 : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువతకు ఉపాధి కల్పిస్తున్నట్లు గానీ, పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు గానీ ఎక్కడా కన్పించలేదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో యువత ఉపాధి అంశంపై బడ్జెట్ ప్రతిపాదన లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మేడ్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా పేరుకే తప్ప వాటిని అభివృద్ధి చేయడంలో, వాటికి నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం మొండి చేయి చూపిందని విమర్శించారు. ప్రతి బడ్జెట్‌లో కోతలు విధిస్తూ కేంద్రం యువత పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దయ్యాల మల్లేశ్, ఎండీ సలీం, ఎస్‌కే రియాజ్, సాజిద్, సోహెల్, హరీశ్‌కుమార్ పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో చేనేత రంగాన్ని విస్మరించిన కేంద్రం'

మోత్కూరు, ఫిబ్రవరి 2 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో చేనేత రంగాన్ని విస్మరించిందని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. పట్టణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025–26 సంవత్సరం బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేనేతకు మొండి చెయ్యి చూపారన్నారు. టెక్స్‌టైల్స్, చేనేతలకు కలిపి మొత్తం రూ.5,272 కోట్లు ప్రతిపాదించిన కేంద్ర ప్రభుత్వం.. టెక్స్‌టైల్స్ రంగానికి పెద్ద పీట వేసి, చేనేత రంగానికి రూ.200 కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. ఎక్కువ మంది కార్మికులు చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం గడుపుతున్నారని, ఆ వృత్తిపై నిర్లక్ష్యం తగదని అన్నారు. సమావేశంలో సంఘం నాయకులు నాందేవ్, సోమరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాల్వ నిర్మాణానికి భూమి పరిశీలన

కాల్వ కోసం భూమిని పరిశీలిస్తున్న ఐబీ ఏఈ వెంకటరమణ

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 2 : మండలంలోని కొరటికల్ – ఆత్మకూరు(ఎం) గ్రామాల మధ్య బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం నుంచి కొరటికల్ గ్రామంలోని చెరువులు, కుంటల్లోకి నీటిని తరలించేందుకు నిర్మించనున్న కాల్వ నిర్మాణానికి భూమిని ఐబీ ఏఈ వెంకటరమణ ఆదివారం పరిశీలించారు. చెక్‌డ్యాం నీటితో నిండినప్పుడు వెనుక భాగం నుంచి కొరటికల్‌లోని చెరువులు, కుంటలను నింపేందుకు అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ కందాడి అనంతరెడ్డి, రైతులు ఉన్నారు.

'దేశ అభివృద్ధిలో యువత ముందుండాలి'

రాయిపల్లిలో మాట్లాడుతున్న సంస్థ అధ్యక్షుడు రాజ్‌కుమార్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 2 : దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు యువత ముందుండాలని యంగ్ ఇండియా యంగ్ లీడర్‌షిప్ ఎన్‌జీఓ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చావ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాయిపల్లిలో ఆదివారం జరిగిన ఎన్‌జీఓ ఆర్గనైజేషన్ 4వ సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత ఉచిత పథకాల గురించి ఆలోచన వదిలిపెట్టి ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదుగాలన్నారు. ఉపాధి కల్పించేలా మారాలని సూచించారు. సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుదగాని మహేశ్వర్‌గౌడ్, వైస్ చైర్మన్ మల్లేశం, కొండల్‌రెడ్డి, రాజుగౌడ్, వెంకటేశ్, శ్రావణ్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి